

# చీటర్

— సొదుం జయరాం

"సెక్రటేరియట్‌కు పోతున్నావా పెదనాన్నా? ఇంత టిఫిన్ తిని పోకూడదూ. మళ్లీ బజార్లో డబ్బు దండుగ ఎందుకూ?" అన్నది రోజలిన్.

వారం రోజులయింది అతను హైదరాబాదుకు వచ్చి. తీరా బయలుదేరగానే ప్రతిరోజూ టిఫిన్ తిని బయలుదేరమని రోజలిన్ చెబుతూనే వున్నది. కానీ వారం రోజులూ అతను ఆమె అభ్యర్థనని ఖాతరు చెయ్యలేదు.

"టిఫిన్‌కు ఏం తొందరలే అమ్మా. వెళ్ళి బజారులో తిని అట్టే సెక్రటేరియట్‌కు పోతాను" అనడం, బయలుదేరడం ఒకేసారి జరిగేవి.

కానీ ఈ రోజు కొంచెం తటపటాయించాడు. ఇందాకా రోజలిన్ బాత్‌రూంలో పిల్లలకు స్నానం చేయిస్తున్నది. ఆమె భర్త కాయగూరలకు మార్కెట్‌కు వెళ్ళాడు. అటూ ఇటూ చూచి గబుక్కున జేబులో డబ్బు తీసి ఎంచుకున్నాడు. బొటాబొటి బస్సు ఛార్జీకి, మధ్యాహ్నం హోటల్ భోజనానికే సరిపడ డబ్బున్నది. టిఫిన్ బజార్లో తింటే మధ్యాహ్నం భోజనానికి సరిపడదు. రోజలిన్ టిఫిన్ తిని పొమ్మనగానే, అతను కొంచెం వెనుకముందాడింది అందుకే.

అతని అడుగు ముందుకుపడకపోవడం చూచి "కూర్చో పెదనాన్నా టిఫిన్ పెడతాను" అంది రోజలిన్. వేడివేడి ఇడ్లీలతోపాటు కొబ్బరిచట్నీ వేసింది. మామూలుగా అయితే అవురావురుమని తినేవాడే కానీ వారం రోజులుగా అతని మనసు దిగులుతో నిండిపోయి ఆకలి మందగించింది. యాంత్రికంగా తింటూ కూర్చున్నాడు. వారం రోజులుగా ఆసుమానులో కండెలా సెక్రటేరియట్ చుట్టూ తిరుగుతున్నాడు. పని ఒక కొలిక్కి రాలేదు. చేతిలో వున్న డబ్బు కాస్తా అయిపోయింది. వారం రోజులుగా దొరకని మినిస్టరుగారి ఇంటర్వ్యూ ఈ రోజన్నా దొరుకుతుందో లేదో? అదీ అతని ఆలోచన.

"ఇంకా పని అయిపోలేదా పెదనాన్నా?" అడిగింది రోజలిన్. "లేదమ్మా. అవుతుందన్న నమ్మకం కూడా లేదు. ఈ రోజు రాత్రి బస్సుకు ఊరికిపోతాను" అన్నాడు స్వామినాథం. అతని మాటల్లో తొంగిచూస్తున్న నైరాశ్యానికి రోజలిన్ హృదయం చలించిపోయింది.

"అయ్యో, అలాగా" అంది రోజలిన్ సానుభూతిగా.

అతను ఏం పనిమీద వచ్చాడో రోజలిన్‌కు తెలియదు. అతను ఆమెకు దూరపు బంధువు. వారం రోజులుగా రాత్రిళ్ళు అక్కడే పడుకుంటున్నాడు. అక్కడే భోంచేస్తున్నాడు. ఇల్లు ఇరుకు. అతను వారం రోజులు అక్కడే తిష్ఠవెయ్యడం ఇబ్బందే. కానీ ఆమె కష్టసుఖాలు తెలిసిన మనిషి. ఇబ్బంది ఫీల్ కాలేదు. వారం రోజులు ఆశ్రయం ఇచ్చినందుకు – అతని పని అయిపోయి వుంటే అదో సంతృప్తి. పని కాకుండానే తిరుగుముఖం పడుతున్నాడంటే, ఆమె మనసు అదోలా అయిపోయింది.

స్వామినాథం టిఫిన్ ముగించి, బయలుదేరదామని బయటికి తొంగిచూచాడు. ఇందాక స్వచ్ఛంగా వున్న ఆకాశం మేఘావృతమైపోయింది. రాగిపరకల్లాంటి తుంపర రాలుతోంది. అక్కడికి సెక్రటేరియట్ మూడు నాలుగు కిలోమీటర్లు వుంది. రోజూ నడిచే వెళ్తున్నాడు. ఇప్పుడూ నడిచే వెళ్లాలనుకున్నాడు. కానీ తుంపర రాలుతోంది. బట్టలు తడిసిపోతే ఎట్లాగా అన్న అనుమానం వచ్చింది. వచ్చేటప్పుడు ఇంట్లో వున్న రెండు జతల బట్టలూ తెచ్చుకున్నాడు. వంటిమీదున్న బట్టలు మాసి చెమట కంపు కొడుతున్నాయి. అవి తడిస్తే ఇక వాటి అవతారం ఎట్లా వుంటుందోనని తలచుకొని అతని వళ్లు కంపరమెత్తింది. ఆటోలో వెళ్ళవచ్చు. కానీ ఆటోవాడు పది రూపాయలన్నా తీసుకొని చిలుం వదలకొడతాడు. మధ్యాహ్నం భోజనం మానుకోవాలి!

భోజనం మానుకోవడమా ? ఆటోలో వెళ్లడమా? అన్నది స్వామినాథానికి పెద్ద సమస్య అయి కూర్చుంది.

మంత్రిగారి దగ్గరికి వెళ్లే ముందు కాస్త పరిశుభ్రంగా వెళ్లడం మంచిది. భోజనం మానుకున్నంత మాత్రాన కండలు కరిగిపోవు. ఆటోలోనే వెళ్దామనుకున్నాడు.

"వర్షం తగ్గినాక వెళ్దువుగాని కూర్చో పెదనాన్నా" అంది రోజలిన్. ఆటో ఖర్చులు ఆదా అయినా మేలే అనిపించింది స్వామినాథానికి – గడపలో వున్నవాడు ఇంట్లోకి వెళ్లి కూర్చున్నాడు.

"ఇంతకూ నీవు వచ్చిన పనేదో చెప్పనే లేదు పెదనాన్నా" అంది రోజలిన్.

చెప్పడానికి మనసొప్పకనే చెప్పలేదు. నలుగురితో చెప్పుకోలేనిది. నగుబాట్లపని. ఆమె మళ్ళీ మళ్ళీ అడిగితే మౌనం వహించడం మంచిది కాదని చెప్పాడు.

"మా అబ్బాయి పీటర్ సిమెంటు ఫ్యాక్టరీలో పర్చేజింగ్ ఆఫీసరుగా పనిచేసేవాడు. పోయిన నెల ఆఫీసు డబ్బు ఇరవై వేలు వాడేడు. నానా గొడవ అయిపోయింది. ఉద్యోగం నుంచి తీసివేశారు. క్రిమినల్ కేసు పెట్టారు. మినిస్టరుగారు కనికరించి కలుగజేసుకుంటే ఈ గొడవలన్నీ సర్దుబాటు అవుతాయేమోనని గంపెడాశతో వచ్చాను తల్లీ" అన్నాడు స్వామినాథం.

"అయ్యయ్యో! అలాగా. పెద్ద తప్పే చేశాడే పెదనాన్నా" అంది అమాయకంగా రోజలిన్.

"పెద్ద తప్పే చేశాడమ్మా" అన్నాడు స్వామినాథం

"ఎందుకు అలా చేశాడు పెద నాన్నా" అడిగింది రోజలిన్.

"శని తల్లీ శని" అన్నాడు స్వామినాథం, శని అనే పదాన్ని వత్తిపలుకుతూ. దాటవెయ్యడానికి స్వామినాథానికి అంతకంటే మార్గాంతరం కన్పించలేదు.

పిల్లకు నీళ్లు పోయడానికి రోజలిన్ బాత్‌రూంలోకి వెళ్ళింది. స్వామినాథం బయటకు చూశాడు. ఇంకా వర్షం పడుతూనే వుంది. ఎప్పుడు తెరపిస్తుందో ఏమో! ఆటోలో వెళ్లడమే మేలనిపించింది. వీథి మొగకు వచ్చి ఆటో వస్తూంటే ఆపి. అందులో కూర్చున్నాడు.

స్వామినాథం ఆలోచనలు పీటర్ మీదికి వెళ్ళాయి. పాపం! అమాయకుడు. లోకమంతా వాడేదో పెద్ద తప్ప చేశాడని కోడై కూస్తున్నది. కాకులు పొడిచినట్టు పొడిచి పొడిచి చంపుతున్నారు. నిజానికి తప్పంతా తనది. తన అసమర్థత మూలాన వాడు చిక్కుల్లో పడ్డాడు. అవును. నిజంగా తనే వాణ్ని చిక్కుల్లోకి తోసింది. తన ముందుచూపులేనితనమే వాని పుట్టి ముంచింది. ముందుచూపులేకనే ఇద్దరితో సరిపెట్టుకొనేదానికి బదులు నలుగురి బిడ్డల్ని కన్నాడు. పీటర్ చిన్నవాడు. ఆడపిల్లలు ముగ్గురూ పెద్దవాళ్ళు. చూస్తూండగానే వాళ్ళు రేసుగుర్రాల్లా యౌవనంలోకి గెంతారు.

ముగ్గురూ ఎదిగి కూర్చున్నారు. "పెద్దదాని విషయమన్నా కాస్త సీరియస్‌గా ఆలోచించరేం" అంటూండేది భార్య. పాపం, స్వామినాథం ఎప్పుడూ జీవితాన్ని గురించి ఆలోచించినవాడు కాదు. చర్చిలో కూచొని ఏసునాథుని ఏ రోజు పొట్టకు ఆ రోజు ప్రార్థించేవాడు. కానీ పిల్లల కట్నాల విషయం ప్రార్థించేవాడు కాదు. శతాబ్దాల నాటి ప్రార్థన. కాలం మారిపోయింది. కట్నాలు లేందే పిల్లలు గడపదాటరు. భార్య రోజూ ఒకటే గొణుగుడు.

"చూద్దాం. దేనికైనా టయిమ్ రావాలి" అనేవాడు తాత్త్విక ధోరణిలో.

కానీ తండ్రి తాత్త్విక ధోరణి బిడ్డ జోసఫిన్‌కు వంటబట్టింది కాదు. తూనీగలాంటి చలాక్ పిల్ల. కాకపోతే కాస్త ఓర్పు తక్కువ. చెప్పాపెట్టకుండా హుసేన్ అనే ముస్లింల అబ్బాయిని పెళ్ళాడేసింది. స్వామినాథానికి ఏడ్వాలో నవ్వాలో అర్థంకాలేదు.

"ఇప్పటికైనా కళ్లు తెరుస్తారా?లేదా?" అని గదమాయించింది భార్య గట్టిగా. అప్పటికీ స్వామినాథం కళ్ళు తెరవకపోయి వుండునేమో! అతని రెండో బిడ్డ శకీమని కళ్లు తెరిపించింది. ఆ అమ్మాయి అక్క అడుగుజాడల్లో నడవబోయి కాలు జారింది. అప్పుడు తెరిచాడు స్వామినాథం కళ్ళు. ఇక ఉపేక్షించకూడదనుకున్నాడు. ఆదరాబాదరా నాలుగు చోట్ల తిరిగి సంబంధం ఖాయం చేశాడు. అరవై వేలు కట్నం.

"ఇంత డబ్బు ఎట్లా సర్దుబాటు చేస్తావు నాన్నా" అన్నాడు పీటర్.

"ప్రావిడెంటు ఫండ్ బాపతు వలభై వేలు నా దగ్గరుంది. మిగతాది ఎలాగో నువ్వే తంటాలుపడాలి. తప్పదు" అన్నాడు స్వామినాథం.

అప్పటికి వాడు ఉద్యోగంలో చేరి ఆర్నెల్లయింది. ఆ ఉద్యోగం కూడా వూరికే రాలేదు. ప్రావిడెంట్ ఫండ్ బాపతు ముప్ఫయి వేలు ముదుపు చెల్లించాల్సి వచ్చింది.

"ఈ సంవత్సరం ఆగితే ఏం నాన్నా. ఒక సంవత్సరం గడిస్తే నా జీతంలోనన్నా ఇంత మిగులుతుంది. అమ్మడానికి మనకేమీ ఆస్తి లేకపోయె. అడవిలో చేనూలేదు. ఊరిలో ఇల్లూ లేదు. ఒక సంవత్సరం ఆగితే..." పీటర్ అన్నాడు.

"ఇక వాయిదా వేస్తే అభాసుపాలయిపోతాం బాబూ" అన్నాడు స్వామినాథం.

ఇక పీటర్ నోరెత్తలేదు. పెళ్లినాటికి ఇరవై వేలు సమకూర్చాడు. అమ్మాయి పెళ్లి అయిపోయిందనిపించాడు. తన భవిష్యత్తు అంధకారబంధురం చేసుకున్నాడు.

ఈ ఆలోచనలతో స్వామినాథం కళ్ళు చెలిమలయ్యాయి. సెక్రటేరియట్ వచ్చింది కూడా గమనించలేదు.

"ఇక దిగండి బాబూ" అన్నాడు ఆటోవాడు.

కన్నీళ్ళు తుడుచుకొని, వాడికి డబ్బులిచ్చి ఆటో దిగాడు. సన్నగా తుంపర రాలుతూనే వుంది. కందిరీగల తుట్టె కదిపినట్టు గేటు దగ్గర ఒకటే జనం. ఆ జనాన్ని చూస్తే ఎప్పటికి ఇంటర్వ్యూ దొరుకుతుందో ఏమో అనిపించింది. వారం రోజులుగా వెయిట్ చేసిచేసి అతని మనసు బేజారయిపోయింది. ఎవరన్నా ఛోటా నాయకుని వెంటబెట్టుకుని వచ్చివుంటే, ఈపాటికి తాడోపేడో తేలిపోయి వుండేది. కానీ తనకు మరొక వ్యక్తిని వెంటబెట్టుకొని రావడమంటే మాటలు కాదు. లాడ్జి ఖర్చులు, భోజనం ఖర్చులు, ఛార్జీలు తడిసి మోపెడవుతుంది. తను ఒక్కడూ రావడానికే డబ్బులు పిగలక సతమతమైపోయాడు.

"ఈ రోజు ఖచ్చితంగా దొరుకుతుందిలెండి" అన్నాడు బంట్రోతు, దగ్గరగా వచ్చి. ఆ మాటతో స్వామినాథం ఆలోచనల్నుంచి తేరుకున్నాడు. ప్రాణం లేచివచ్చింది. "కాస్త దయపెట్టు నాయనా. నీకు పుణ్యం వుంటుంది" అన్నాడు స్వామినాథం ప్రాధేయపూర్వకంగా. వాడికి పుణ్యంతో పనిలేదు. పాపం కా[illegible].

"ఐదు రూపాయిలివ్వండి. కాఫీ తాగుతాను" అన్నాడు. చావు బిడ్డను గడ్డకు తీసినట్టు కష్టపడి ఐదు రూపాయిలు బయటికి తీసి ఇచ్చాడు. బంట్రోతు రాతికి చక్కిలిగిలి పెట్టగల సమర్థుడు. వాడు ఎవర్నీ వదలడు.

"మీరు మంత్రిగారి నియోజకవర్గం మనిషే కదా" అన్నాడు డబ్బు గబుక్కున జేబులో వేసికొని. వాడు ఈ విషయం రోజూ అడుగుతూనే వున్నాడు. తాను రోజూ చెబుతూనే వున్నాడు.

"నియోజకవర్గం ఏం ఖర్మ. ఇద్దరం ఒక వూరి వాళ్ళమే" అన్నాడు స్వామినాథం.

"మరి ఆ మాట చెప్పరేం. ఉండండి. కాసేపట్లో మిమ్మల్ని పంపిస్తాను" అన్నాడు బంట్రోతు.

స్వామినాథానికి సంతోషమయింది. కాసేపట్లో మంత్రిగారిని కలువబోతున్నాననుకొనేసరికి బెరుకు కూడా ప్రారంభమయింది. మంత్రిగారు తన వూరివాడే. కానీ అది ఏనాటి మాట! స్వామి

## ●కథల కాణాచి●

నిర్మాతలకు కథలు అంటగట్టడంలో దిట్ట అనిపించుకున్న అతని భార్య ఒకరోజు సిటీబస్‌లో వెళ్తున్నప్పుడు కొద్ది దూరంలో కనిపించిన ఓ థియేటర్ వంక చూసి "ఆ హాలులో మా ఆయన కథ రాసిన సినిమా ఆడుతున్నట్లుంది" అంది.

పక్కసీటులో కూర్చున్న ఆమె స్నేహితురాలు "చాల్లే నీ బడాయి! బ్యానర్‌గాని, పోస్టర్లుగాని ఇక్కడికి స్పష్టంగా కనబడడంలేదు. మీవారు రాసిన కథ అని ఎలా చెప్పగలవు?" అని క్షణమాగి, "ఓహో ఆ ముందు జనం హడావిడి అట్టే లేదుగా? టిక్కెట్ కౌంటర్ల వద్ద కూడా జనం లేరేమో! నువ్వు చెప్పింది కరెక్టే అయి వుంటుంది" అని చురక వేసింది.

కథకుని పత్ని ముఖం మాడిపోయినట్లయింది.

— జి.వి.జి.

నాథం బి.ఇడి., చదివి ఒక సంవత్సరంపాటు ఇంటిపాటున వున్నాడు. అప్పుడు ఈ మినిస్టరుగారికి పదేళ్లలోపు వయసు. మినిస్టరు నాన్నగారు కూడా స్వామినాథానికి తెలుసు. అతని పేరేమిటో సరిగ్గా జ్ఞాపకం లేదు. అందరూ అతణ్ణి అలాల్ సాయిబూ అనేవాళ్లు. ఆ చిన్న పల్లె లో అలాల్ చెయ్యగల సాయిబూ అతనొక్కడే. అలాల్ చేసినందుకు మూడు కుండలు యిచ్చేవారు. చర్మాలు అతనే కొనేవాడు. తన పనికి తోడుగా ఎవ్వడూ కొడుకును వుంచుకొనేవాడు. ఈ వ్యాపారం వల్లే అతని జీవనోపాధి జరిగేది. కొన్నాళ్ళకి ఆ పల్లె వదలి టౌనుకెళ్ళి చర్మాల అంగడి పెట్టాడు. దాంట్లో బాగానే సంపాదించాడంటారు. ఆ తర్వాత కొడుకు ఎదిగి వచ్చాడు. అతను రూటు మార్చాడు. సారాయి కంట్రాక్టులు చేశాడు. చీప్ లిక్కర్లు తయారుచేశాడు. ఏది లాభదాయకమనుకుంటే అదల్లా చేశాడు. లక్షలు సంపాదించాడు. అట్లా లక్షలు సంపాదించిన తర్వాతనే ఒకటి రెండుసార్లు కలిశాడు. ఒకసారి బజార్లో వెళ్తుంటే జీపు ఆపి పలకరించాడు. స్వామినాథం గుర్తించలేదు.

"నేనండీ... అబ్దుల్‌ని" అన్నాడు.

"అరే నువ్వా! మీ నాన్న బాగున్నాడా?"

"ఆయన లేడండి. చనిపోయాడు."

"అలాగా, నువ్వేం చేస్తున్నావిప్పుడు?"

"చాలా వ్యాపారాలున్నాయిలెండి. రాజకీయాలలోకి రావాలనుకుంటున్నాను. మీలాటి పెద్దల ఆశీర్వాదాలు కావాలి."

"దానికేముంది బాబూ. తప్పకుండా" అన్నాడు స్వామినాథం.

అన్నట్టుగానే ఆ తర్వాత ఎలెక్షన్లలో నిలబడ్డాడు. అప్పుడొకసారి కన్పించి నమస్కరించి ఓటడిగాడు. ఆ తర్వాత ఎవరూ ఊహించని విధంగా మినిస్టరయిపోయాడు. ఆ మినిస్టరుగారి దర్శనం కోసమే వారం రోజులుగా పడిగాపులు కాస్తున్నాడు తను ప్పుడు. బంట్రోతు స్వామినాథం దగ్గరికి వచ్చి భుజం తట్టాడు. స్వామినాథం ఈ లోకంలోకి వచ్చి, "ఇంకా ఎంత సేపుండాలి నాయనా" అన్నాడు.

"అదే చెబుదామని వచ్చాను. లోపల నరసింహంగారని కార్పొరేషన్ చెయిర్మన్ హస్కు కొడుతున్నాడు. ఆయన ఒక పట్టాన లేవడు. మీరు మినిస్టరుగారి దగ్గరకు వెళ్ళండి" అన్నాడు.

"అలా వెళ్తే బాగుంటుందా?" అన్నాడు స్వామినాథం సంశయిస్తూ.

"వెళ్ళండి., ఏం ఫర్వాలేదు" అంటూ లోపలికి తోశాడు.

నిజంగానే వాళ్లిద్దరూ ఆషామాషీగా మాట్లాడుకుంటున్నారు. స్వామినాథం వెళ్ళి నమస్కరించాడు. మంత్రిగారు ఆ నమస్కారం స్వీకరించినట్టు లేదు. మంత్రిగారితో మాట్లాడుతున్న నరసింహం స్వామినాథాన్ని ఎగాదిగా చూచి "కూర్చోండి" అన్నాడు.

మంత్రిగారి దగ్గర తనలాంటివాడు కూర్చోవచ్చునో లేదో అన్న సందేహం కలిగింది. కడకు ఒక నిశ్చయానికొచ్చి కుర్చీ మీద కూర్చున్నాడు.

"విజిటర్స్ వస్తున్నారు. నువ్వు వచ్చిన పనేమిటో చెప్పవయ్యా నరసింహం" అన్నాడు మినిస్టరు.

"రేపు నెల్లో రాష్ట్ర స్థాయిలో రజక మహాసభ జరుపుతున్నాం. వెయ్యి మంది డెలిగేట్లు వుంటారు. మహాసభకు దాదాపు లక్ష మంది..."

"ఆపవయ్యా ఆ గొడవలన్నీ ఎందుకు. చందా కావాలంటావు? ఎంతివ్వాలేమిటి?"

"ఎంతోనా. పది వేలు చాలు."

"నా దగ్గరేమన్నా చెట్లకు కాస్తున్నాయా రూపాయిలు. పది వేలు అడుగుతున్నావు."

"రూపాయిలు చెట్లకు కాసినా అది చాలా లేట్ ప్రాసెస్ గదండీ" అన్నాడు నరసింహం.

"సర్లే. ఎవర్నన్నా మనిషిని పంపు. ఇచ్చి పంపుతాను" అన్నాడు మినిస్టరు.

స్వామినాథం ఊపిరి పీల్చుకున్నాడు. ఇక తన విషయం విన్నవించుకోవచ్చు. కానీ మినిస్టరుగారు తనవైపే చూడ్డంలేదు. కానీ ఆపద్బాంధవుడిలా నరసింహంలు చక్రం అడ్డం వేశాడు.

"ఆయన విషయం ఏదో చూడండి" అన్నాడు.

స్వామినాథం లేచి నిలబడి తన విషయం వివరించాడు. మినిస్టరు అంతా విని,

"చీటింగ్ కింద కేసు నమోదుచేశారని మీరే చెబుతున్నారు. మీరు ఇప్పుడు డబ్బు కట్టినా మీ వాడు చేసింది క్రైం కాకుండా పోతుందా? క్రిమినల్ కేసు విత్ డ్రా చేసుకోమనీ, మళ్లీ ఉద్యోగం ఇవ్వమనీ ఎట్లా రికమెండ్ చెయ్యమంటారు?" అన్నాడు ఏకధాటిగా మహాత్మాగాంధీగారిలాగా ముఖం పెట్టి.

కుక్కాకు గుండ్రాయితో తీరినట్టుగా అయింది స్వామినాథం పని. పెద్దలతో పని. ఒకటి మాట్లాడితే తక్కువ. రెండు, మాట్లాడితే ఎక్కువ. ఏం మాట్లాడటానికి తోచని పరిస్థితిలో వుండిపోయాడు స్వామినాథం. ఇంతలో నరసింహం మళ్ళీ కలుగజేసుకున్నాడు.

"ఏ నేరం చెయ్యకపోతే, ఆయన ఇంత దూరం రావలసిన పనేముంది? ఈ శ్రీరంగనీతులు వినడానికా?"

"చట్టమనేది ఒకటుందయ్యా నరసింహం మహానుభావా! నా యిష్టం వచ్చినట్టు చెయ్యడానికి అది నా 'చుట్టపురాలు' కాదు."

"చట్టం చుట్టపురాలో, కాకుంటే కట్టుకున్న పెళ్లామో మనమిద్దరమే వుంటే చెప్పేవాణ్ణి. ఇప్పుడా విషయాలెందుకుగాని, మానవతావాద దృష్టితో ఆయనకు న్యాయం చెయ్యి" అన్నాడు నరసింహం.

"ఎడ్డెం అంటే తెడ్డెం అంటావు. రేపు అసెంబ్లీలో దూదేకినట్టు ఏకుతారు ప్రతిపక్షీయులు. సమాధానం చెప్పకోవలసింది నేను. నీ సొమ్మేం పోయింది" అన్నాడు మినిస్టరు.

తన తరపున వకాల్తా పుచ్చుకొని వత్తాసు పలుకుతున్న నరసింహం పట్ల స్వామినాథం హృదయం కృతజ్ఞతతో నిండిపోయింది. ఎవరైతేనేంగాక పాపం చాలా బలంగా చెప్పాడు. కానీ కేసు వీగిపోయింది. స్వామినాథానికి వెన్నులు విరిగాయి. కళ్ళు బైర్లు కమ్మినట్టు అయింది. నెమ్మదిగా నడుచుకుంటూ బయటకు వచ్చాడు. కానీ అడుగులు ముందుకు పడడం లేదు. నిశ్చేతనంగా నిలబడిపోయాడు. ఎవరిదో భుజం మీద చెయ్యి పడితే వెనక్కి తిరిగి చూచాడు. బంట్రోతువాడు మళ్ళీ

---

**తారుమారు!**

కుమారి, శ్రీమతి
అక్కా చెల్లెళ్ళు
కుమారి పెళ్ళి చేసుకుని
శ్రీమతిగా మారిపోయింది!
శ్రీమతి పెళ్ళి చేసుకోక
కుమారిగానే మిగిలిపోయింది!!

– తాజ్‌ప్రసాద్

---

వచ్చే వారం

# ఇలవేలుపులు

–వడ్లమూడి ప్రభావతిదేవి

---

చాలా సంవత్సరాల క్రితం మద్రాసు నుంచి వచ్చే ఓ పత్రిక (ప్రస్తుతం రావడం లేదు) ఎడ్వర్టయిజ్‌మెంట్ పోస్టర్లు హైదరాబాద్ గోడల నిండా అంటించారు.

అందులో ఇలా ఉంది:

శ్రీమతి రాధాదేవి 'ఆఖరి రాత్రి' నవల

– వీరభద్రరావ్ పమ్మి

డబ్బు కోసం వచ్చాడు. "పని కాలేదయ్యా" అని చెప్పడానికి కూడా అతని నోరు పెగల్లేదు. మళ్ళీ మినిస్టరుగారి దగ్గర తనకు వత్తాసు పలికిన వ్యక్తే ఆదుకున్నాడు. అప్పుడే అతను బయటకు వచ్చాడు.

"ఏమిట్రా అయన్ను సతాయిస్తున్నావు. వెళ్లు. వెళ్ళు" అంటూ గదురుకున్నాడు. వాడు పిల్లిలాగా వెనక్కు జారుకున్నాడు.

"మీరు ఎక్కడికి వెళ్లాలో చెప్పండి. కారులో డ్రాప్ చేస్తాను" అన్నాడు నరసింహం.

"నేను... నేను... నడిచే వెళ్తాను" తడబడుతూ అన్నాడు స్వామినాథం.

డ్రైవరుకారు తలుపు తెరిచి పట్టుకున్నాడు. నరసింహం వెళ్ళి కూర్చోకుండా, "రండి మాస్టారు" అన్నాడు.

స్వామినాథం కూర్చోక తప్పలేదు. తడిసిన పిచ్చుకలా వొదిగి కూర్చున్నాడు. మాసి, చెమటకంపు కొడుతున్న బట్టల్తో అతని ప్రక్కన కూర్చోవడం ముళ్లమీద కూర్చున్నట్టుంది. కారు స్టార్ట్ అయింది. అతను సిగరెట్ తీసివెలిగించాడు. పొగ గుప్పున వదిలి అన్నాడు,

"రేపు పదకొండింటికి సెక్రటేరియట్‌కు రండి. నేను సి.ఎం. పేష్ దగ్గర వుంటాను. మీరు అక్కడికి వస్తే ముఖ్యమంత్రిగారి పి.ఎ.తో ఆ మేనేజింగ్ డైరెక్టరుగాడికి ఫోన్ చేయిస్తాను. ఆ వెధవ ఎవడోగాని చిన్న తప్పుకు కడుపు కొట్టడానికి పూనుకున్నాడు. మీరేం భయపడకండి. నేనున్నాను" అన్నాడు.

స్వామినాథం హృదయం కృతజ్ఞతతో నిండిపోయింది. కనుగొలుకుల్లో నీళ్లు నిలిచాయి. అతనితో ఫ్రీగా మాట్లాడడానికి ధైర్యం చాల్లేదు. కాసేపున్న తర్వాత ధైర్యం కూడగట్టుకుని అన్నాడు,

"మినిస్టరుగారు ఈ పని చెయ్యడం సాధ్యం కాదంటున్నారు. మీరేమో..." అంటూ నసిగాడు.

అతను గలగలా నవ్వి అన్నాడు.

"మినిస్టరుగారే కాదు. నేనైనా అలాగే అంటాను. రెండు లక్షల చందా ఇవ్వగల ఆర్థిక స్థోమత వున్నవాడో, నాలుగు వేల ఓట్లు రిగ్గింగ్ చేయగల పాలెగాడో అయితే అది వేరు సంగతి. మీరు మామూలు ఓటరు మాత్రమే. మీ కోసం ఏ నాయకుడైనా ఎందుకు రిస్కు తీసుకుంటారు మాస్టారూ"

"పోనీ మీరు చెప్పినట్టు మానవతావాద దృష్టితోనైనా చెయ్యవచ్చు గదా?" స్వామినాథం అన్నాడు.

"ఆయన దగ్గర నేనేదో మాటవరసకన్నాను. రాజకీయానికీ, మానవత్వానికీ ఆమడ దూరం" అన్నాడు నరసింహం.

"మీలాగా హృదయం వున్నవాళ్లు మాటికో కోటికో ఒకరుంటారు. అందుకే ఈ లోకంలో ఇంకా కొంచెం న్యాయం, ధర్మం నిలబడి వున్నాయి" అన్నాడు స్వామినాథం. ఈ మాట అంటూండగా అతని కంఠం ఒణికింది. "అంత పెద్ద మాటలు ఉపయోగించకండి. మీతో అబద్దాలు చెబితే దేవుడు తంతాడు. వాస్తవం చెప్పాల. నేను మీ మినిస్టరు కన్నా లుచ్చాని. చాలా నేరాలు చేశాను. డబ్బు సంపాదించాను. "మనీ బిగెట్స్ పవర్" అధికారం వుంది. అంతే" అన్నాడు.

స్వామినాథం అయోమయంలో పడిపోయాడు. అయాచితంగా అతను తనవెందుకంత గౌరవిస్తున్నాడో, ఆదరిస్తున్నాడో బోధపడలేదు. కాసేపు నిశ్శబ్దం తాండవించింది. మళ్లీ అతనే అన్నాడు,

"మాస్టారూ మీరు నన్ను గుర్తించలేదా?" అన్నాడు అతను వున్నట్టుండి. అప్పుడు స్వామినాథం ఎగాదిగా చూచాడు. కానీ ఎంత ప్రయత్నించినా ఆ వ్యక్తి స్ఫురణకు రాలేదు. కనుక్కోలేకపోయినందుకు సిగ్గుపడ్డాడు.

"వయసు పైబడింది. జ్ఞాపకశక్తి క్షీణించింది" అన్నాడు సమాధానంగా స్వామినాథం.

"మీ రెప్పుడన్నా ద్రౌపదీ వస్త్రాపహరణ నాటకంలో 'ప్రాతిగామి' వేషం కట్టారా?" ప్రశ్నించాడు నరసింహం. సందర్భం లేకుండా ఆ మాట ఎందుకన్నాడా అని స్వామినాథం ఒక్కసారి ఖంగుతిన్నాడు.

ప్రాతిగామి.... ప్రాతిగామి....

స్వామినాథం మెదడు అట్టడుగు పొరల్లోంచి తన్నుకొని ఒక జ్ఞాపకం బయటకు వచ్చింది. పాతిక సంవత్సరాల ముందునాటి సంగతి. తను ఓరంపాడు హైస్కూల్లో పనిచేస్తున్నాడు. స్కూల్ డే కి పిల్లలతో ద్రౌపదీ వస్త్రాపహరణ నాటకం వేయించాలనుకున్నాడు. పాత్రల ఎన్నికల పెద్ద రగడకు దారి తీసింది. ముఖ్యపాత్రలు నా కంటే నాకని పిల్లలు కొట్లాడుకోవడానికి మొదలుపెట్టారు. ఏదో ఒక పద్ధతి అవలంబించకపోతే లాభం లేదని మార్కుల ప్రాతిపదిక పెట్టాడు. అంతా సరేనన్నారు. అందరికన్నా మార్కులు తక్కువ వచ్చిన నారయ్యకు ప్రాతిగామి పాత్ర వచ్చింది. వాడు టెంత్‌క్లాస్ చదువుతున్నాడు.

"ప్రాతిగామి పాత్ర నేను వెయ్యనుగాక వెయ్యను" అన్నాడు నారయ్య.

"వేసి తీరాల్సిందే" అన్నారు పిల్లలంతా ముక్తకంఠంతో.

"ససేమిరా నేను వెయ్యను" అన్నాడు నారయ్య.

ఎందుకొచ్చిన తగాదా అని స్వామినాథం ఆ పాత్ర నేను వేస్తాలెమ్మన్నాడు. తగాదా ముగిసింది. ఇన్నాళ్లకి మళ్ళీ ఆ విషయం జ్ఞాపకం వచ్చింది.

"జ్ఞాపకం వచ్చిందా మాస్టారూ? ఈ నరసింహమే ఆ నారయ్య"

స్వామినాథం నోరు వెళ్ళబెట్టి అతని వైపు చూశాడు. వాడు తన శిష్యుడు! ఎంతటివాడయిపోయాడు!

"బాబూ! నువ్వా" ఆశ్చర్యంగా అన్నాడు స్వామినాథం.

"అవును మాస్టారూ. మీ శిష్యుణ్నే. అందుకనే మీకు సాయం చేయాలనుకుంటున్నాను" నరసింహం అన్నాడు.

స్వామినాథానికి మహదానందం అయింది. ఇక తన పని అయినట్టే లెక్క. ఆ ఏసుప్రభువే తన శిష్యుడి రూపంలో వచ్చి ఆదుకుంటున్నాడనిపించింది. పని కాగానే వేలాంగని వస్తానని, తలనీలాలిస్తానని మనసులో మేరిమాతకు మొక్కుకున్నాడు. స్వామినాథం ఇంటి దగ్గరే కారు ఆపాడు. నరసింహానికి కృతజ్ఞతలు చెప్పి ఇంటివైపు నడిచాడు. ఎక్కడలేని సత్తువా వచ్చింది. గాలిలో తేలుతున్నట్లు నడిచాడు.

ఇంట్లోకి వెళ్ళగానే "పెదనాన్నా నీ కేదో టెలిగ్రాం" అంటూ చేతికిచ్చింది రోజలీన్. చేతులు వణికాయి. విప్పి చదివాడు. రెండే ముక్కలు..

"పీటర్ కమ్మిటెడ్ సూయిసైడ్. స్టార్ట్ అట్ వన్స్."

ఆ రెండు ముక్కలూ చదివి, "ప్రభువా! ఈ సమస్యను ఇలా పరిష్కరించావా తండ్రీ" అంటూ భోరున విలపించాడు స్వామినాథం. ●

## ఫలితంలేని బేకింగ్

ఓసారి వేలు 'ప్రతిఘటన'లో నటిస్తున్నప్పుడు వైజాగ్‌లో మిట్ట మధ్యాహ్నం ఎర్రటి ఎండలో తార్రోడ్డు మీద పడుకోవాల్సి వచ్చిందట. ఒంటిమీద గుడ్డలు లేనంతగా చింపేసి చంపి రోడ్డు మీద పడేస్తే శవం లాగా నటించాల్సిన సీను. యూనిట్ అంతా పక్కనే వున్న మూడంతస్తుల భవనం మీదకెక్కి రోడ్డు మీద చచ్చిపడినట్లున్న వేలును చిత్రీకరిస్తున్నారు. ఎండ మాడ్చేస్తోంది. తార్రోడ్డు మీద వీపు మాడిపోతోంది. భవనం మీదికెక్కిన యూనిట్ తను వుండడాన్ని తీశారో, తీస్తున్నారో, తీస్తారో ఏమిటో తెలియదు. 'సన్ బేదింగ్' కాదు, వేలు పరిస్థితి 'సన్‌బేకింగ్' కాస్సేపుంటే మాడిన రొట్టెలాగా తయారయ్యేవాడేనట. తీరా అంత కష్టపడి శవంలాగా నటిస్తే ఆ సీను సినిమాలో వుంచలేదట. హైదరాబాద్‌లో కృష్ణనగర్‌లో మళ్ళీ ఆ సీను నటింపజేసి దాన్ని సినిమాలో పెట్టారట. వేలు సహజంగా సన్‌బేకింగ్ అయినందుకు ఫలితమిది.

— ఆర్.ధనంజయ